# 4 పలాయనం

వ్రాస్తూన్న రిపోర్ట్‌లో ఒక పేరా ముగించి ప్రకాశ్ తల ఎత్తి అప్రయత్నంగా గ్రేస్ వంక చూశాడు.

అతని ఒళ్లు పులకరించింది.

గుండె ఒక స్పందనం మరిచి పోయింది.

అతని కళ్ళు రెప్ప పడకుండా, కదలకుండా గ్రేస్ కళ్లలోకి చూస్తూ అలాగే ఉండిపోయాయి.

చేస్తూన్న పని సగంలో ఆపి గ్రేస్ అతని వైపు విశ్చలంగా చూస్తూంది—అందంగా, పెన్ మూత పెదవులపైని సున్నితంగా ఉంచి, ఆలోచిస్తూన్నట్టు.

కొన్ని క్షణాలు తియ్యగా గడిచిపోయి, హృదయం ఉద్రేకంతో స్పందనం మళ్లీ ప్రారంభించాక, చలువరాతి వీనస్‌తో ఆమెని పోల్చుకున్నాడు ప్రకాశ్. ఆ ఉపమానం అదే మొదటిసారి అయినా, ఆమెని అందమైన వాటితో ప్రేమగా సరిపోల్చడం అతనికి మొదటిసారి కాదు. ఆరు నెలల కిందట ఆమె తన ఆఫీస్‌లో, అంటే తాను పనిచేస్తూన్న ఆఫీస్‌లో చేరాక అతను చాలా సార్లు ఆమె సౌందర్యాన్ని మెచ్చు కున్నాడు.

'గ్రేస్'....ఎంత చక్కటి పేరు!

ఆమె సార్థక నామధేయ!

అలా అని అతను చాలాసార్లనుకున్నాడు.

ఈ క్షణంలో అతని కవన్నీ జ్ఞాపకం వచ్చాయి.

గ్రేస్ తన వంక కన్నార్పకుండా అలాగే చూస్తూంది, ప్రాణం ఉన్న చిత్రంలాగ.

ఏం చేయ్యాలో బోధపడలేదు ప్రకాశ్‌కి చిరునవ్వు తెచ్చు కోవాలని పించింది. కాని ముఖంలోని కండరాలు బిగుసుకు పోయాయి. అచేతనుడయాడు.

మరికొన్ని క్షణాలు ఆమె అతని వైపు కళ్లార్పకుండా చూసింది ఆమె ఏకాగ్రత అతని అచేతనత్వాన్ని మరింత ఎక్కువ చేసింది. తానూ శిలాప్రతిమే అనుకున్నాడు ప్రకాశ్. ఆమె చలువ రాతి వీనస్....తాను నల్లరాయి.

ఆమె అందమైన ముఖం వెన్నెల్లో పరిమళం లాటి సున్నిత మైన ఒక మందహాసంతో ఇంకా అందగా కనిపించింది. అతని శిలాప్రతిమ ఆ ఉద్రేకంలో ఇంకా గట్టిపడిపోయింది. మహాకాంతిని లాగ ఆ అందాన్ని అతను చూడలేక పోయాడు.

అతను తల వంచుకొని మొదలు పెట్టిన రిపోర్ట్ మీదికి కళ్లు తిప్పాడు. అతని కా అక్షరా లేమీ కనిపించలేదు. కళ్ళనిండా, మనసు నిండా గ్రేస్। కాని, ఆమెవైపు మళ్లీ చూసే ధైర్యం అతనికి లేదు.

వ్రాస్తూన్నట్టు నటిద్దా మనుకున్నాడు. కాని, స్వాధీనం కాలేదు.

ఆమె ఉద్దేశం ఏమిటి?

ఎందుకలాగ చూస్తూంది తన వైపు?

వెక్కిరిస్తూందా?

ఈ ఆరు నెలల్లోనూ ప్రకాశ్ చాలాసార్లు గ్రేస్‌తో కల్పించు కుని మాట్లాడాడు. ఆమె ఆఫీస్‌లో జాయిన్ అయిన రోజు అందరి తోనూ పరిచయం చేసుకున్నట్లే అతని దగ్గరికీ వచ్చింది.

"నా పేరు గ్రేస్...." అంది, అతని సీటుకి వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ.

"మీకా పేరు బాగా సరిపోయింది" అన్నాడు ప్రకాశ్.

"అలాగా?" అంది పలచటి చిరునవ్వుతో.

హద్దుమీరి తాను మాట్లాడానని తెలుసుకున్న ప్రకాశ్ ఒక్క సారి తెలివి తెచ్చుకుని చల్లబడ్డాడు. ఆఫీసులో, అపరిచిత అయిన

అమ్మాయితో, ఆమెని గురించిన వ్యక్తిగత విషయాలు, పొగడ్తలో నైనా సరే, ప్రస్తావించడం మర్యాద కాదు. కాని, ఆమె సౌందర్యం అలాటిది.

ఆమె తటపటాయిస్తూ కూర్చుంది.

"నా పేరు ప్రకాశ్...." అన్నాడు అతను లాంఛనాల్లోకి దిగుతూ.

"మిస్టర్ ప్రకాశ్! గ్లాడ్ టు మీట్ యూ" అంది గ్రేస్ తియ్యగా.

"డిలైటెడ్!

లంచ్ టైమయిపోయింది.

"మీరు లంచ్‌కి వెడతారా?" అంది గ్రేస్.

"అవును...." అన్నాడు ప్రకాశ్.

క్షణం అతన్ని పరిశీనగా చూసి, సెలవు తీసుకుని గ్రేస్ వెళ్ళిపోయింది. అతను మరో పది నిమిషాల తరువాత లంచ్‌కి ప్రక్కనే ఉన్న రెస్టారెంట్‌కి వెళ్ళేసరికి గ్రేస్‌కూడా అక్కడ ఉంది. మరో ఇద్దరు కొలీగ్స్‌తో. నాలుగైదు సార్లు ప్రకాశ్ ఆమెని చూశాడు. కాని, గ్రేస్ అతని వైపు చూడలేదు.

'రెండు పొరపాట్లు చేశానీ వేళ' అనుకున్నాడు ప్రకాశ్.

ఆదిలోనే ఆమెకీ, తనకీ మధ్య అలాటి పరిస్థితి రావడం ప్రకాశ్‌కి చాలా బాధ కలిగించింది. అందమైన అమ్మాయిలంటే అతనికి విపరీతమైన వ్యామోహం. అతని జీవితంలోకి వచ్చిన అలాటి అమ్మాయి లందరిలోనూ గ్రేస్ మరీ అందంగా ఉంది. ఆమె అతని ఆఫీసులోకి వచ్చినట్టే, అతని జీవితంలోకీ వస్తుందనే అతని ముందరి ఆశ ఈ విధంగా మొదటి రోజే దెబ్బ తింది.

ఆ ఆశ ఒక్కటే కాదు. అతని స్వోత్కర్షకూడా దెబ్బ తింది. తాను చాలా స్మార్ట్‌గా ఉంటాననీ, చూడ్డానికి చక్కగా ఉంటాననీ ప్రకాశ్ నమ్మిక. ఒకరిద్దరు అతన్ని ఆ విషయంలో అభినందిం డంతో అతనికి ఆ నమ్మిక బాగా బలపడిపోయింది. గ్రేస్ తనని

కొద్ది క్షణాల్లోనే నవ్వులపాలు చెయ్యడంతో అతను చాలా బాధ పడ్డాడు.

ఆ తరువాత అతను గ్రేస్‌కి దూరంగా ఉంటూ వచ్చాడు. ఇష్టం లేని అమ్మాయిలకి దూరంగా ఉండడం మంచిదనే పాఠం అతను అంతకుముందు ఒకటి రెండుసార్లు బలీయమైన పరిస్థితుల్లో నేర్చుకున్నాడు.

కాని, గ్రేస్ అతని ఆలోచనల నించి ఎప్పుడూ దూరం కాలేదు. ఆమె అతని కొక వ్యసనం అయిపోయింది. చాలా సార్లు అతను తెగించి ఆమెతో తన పరిచయాన్ని తన కిష్టమైన దిశలో ఒకటి రెండు దడుగులు వేయిద్దామని అనుకున్నాడు. కాని, ఆమె చల్లటి చిరునవ్వు విచిత్రంగా అతని వేడివేడి కోరికలమీద చన్నీళ్లు పోసింది.

ఆ చిరునవ్వుతో హేళన అతన్ని చాలా బాధ పెట్టింది. 'నీ మనసులో ఏముందో తెలుసులే....కాని నేను అందని మేఘాన్ని!' అని ఆమె అంటూన్నట్టు ఉండేది ఆ చిరునవ్వు. ఆమె కళ్లలో కనిపించే సౌందర్యంలో దాగి, తొంగి చూస్తూ ఉండే సవాల్, ఈ చిరునవ్వు—రెండూ కలిపి ఆరు నెలలనించి ప్రకాశ్‌ని పిచ్చివాడిగా చేశాయి.

ఒకసారి ప్రకాశ్ ఆలస్యంగా ఉండిపోవలసి వచ్చింది ఆఫీస్‌లో—ఒక కొత్త కస్టమర్ కోసం కొన్ని శాంపిల్సు. కొంచే షన్లూ పంపవలసివచ్చి. చాలా టీ తోటలమీద యాజమాన్యం ఉన్న ఈ కంపెనీకి ఆ కస్టమర్ చాలా ముఖ్యమైనవాడు కావడాన్నీ, అవకాశం రాగానే మానేజర్ అయే ఆశ ఉండడాన్నీ రాత్రి ఎనిమిది దాకా కూర్చుని, పని ముగించి లేచి వెళ్ళడానికి సిద్ధ పడ్డాడు ప్రకాశ్.

అప్రయత్నంగా అతను గ్రేస్ సీట్ పక్క నిలబడ్డాడు. టేబిల్ మీద ఆమె పర్స్ కనిపించింది. ఆమె బాగ్‌లోనించి ఎందుకో తీసి, టేబిల్ మీద వదిలి వెళ్లిపోయిందన్న మాట.

పర్సు తీసి జేబులో ఉంచుకుని రేపివ్వడమా, డ్రాయర్‌లో పెట్టి తాళం వెయ్యడమా అని ఆలోచిస్తూంటే గ్రేస్ తొందరగా లోపలికి వచ్చింది.

"హల్లో!" అన్నాడు ప్రకాశ్.

"హల్లో!" అని పొడిగా, నీరసంగా అని గ్రేస్ తన టేబిల్ వెతక బోయింది.

'మీ పర్సు టేబిల్‌మీద ఉంటే తీశాను. ఏం చెయ్యడమా అని ఆలోచిస్తూంటే మీరే వచ్చారు' అంటూ ప్రకాశం ఆమెకి పర్సు ఇచ్చేశాడు.

'థాంక్స్' అంది గ్రేస్ చాలా కృతజ్ఞతతో.

అంత కృతజ్ఞత అతనికి హేళనలాగ అనిపించింది.

'ఇప్పటిదాకా ఏం చేస్తున్నారు?' అంది, పర్సు బాగ్‌లో పెట్టు కుంటూ.

'అర్జెంట్ పని తగిలింది.... రేపటి ఫ్లయిట్‌లో వెళ్ళవలసిన మేటర్....'

'అలాగా' అంది బయటికి నడుస్తూ గ్రేస్.

అతనూ బయటికి నడిచాడు. కునికిపాట్లు పడుతూన్న దర్వాన్ను లేపి, లిఫ్ట్ కోసం ఎదురుచూస్తూ ఆమె పక్కన నిలబడ్డాడు ప్రకాశ్ అతనికి ఆకలిగా ఉంది. ఆమె డిన్నర్‌కి వస్తుందా?

అడుగుదా మనుకున్నాడు. కాని ఆమె చిరునవ్వు ముళ్ళపొద లాగ గుచ్చుకుంది. విశ్శబ్దంగా ఉండిపోయాడు.

కిందికి వచ్చేసరికి ఫెయిర్లీ ప్లేస్ సుమారు నిర్మానుష్యంగా ఉంది.

'మీ రెక్కడ ఉండడం?' అంది గ్రేస్.

'సదరన్ అవెన్యూలో....' అన్నాడు ప్రకాశ్.

'మీ రెక్కడ?' అని అడుగుదామనీ, కనీసం ఆమెని ఇంటి దగ్గర దిగవిడుద్దామనీ అనుకున్నాడు ప్రకాశ్. కాని, ఆమె ఆ ప్రశ్న కోసమూ, ఆ సూచన కోసమూ ఎదురు చూస్తూందనీ, తన సహాయాన్ని నిరాకరిస్తుందనీ అతని కనిపించింది.

డల్హౌసీ స్క్వేర్ దాకా ఆమెతో నడిచాడు. 29 నంబర్ ట్రామ్ వచ్చింది. ఎక్కి. కాలీఘాట్ దగ్గరికి 24 వ నంబర్ లోనో. టాక్సీలోనో ఇంటికి చేరుకుందా మనుకున్నాడు అతను. అతని ఆలోచన ముగిసేలోగానే గ్రేస్ లోపలికి వెళ్ళి ఖాళీగా ఉన్న ట్రామ్‌లో కూర్చుంది. అతను ట్రామ్ ఎక్కలేదు. ఆమె ఇటు చూడకుండా వెళ్ళిపోయింది.

ఆమె నిరాశ పడ్డట్టు కనిపించింది ప్రకాశ్‌కి. బహుశా తనని అవమానపరిచే అవకాశం రానందుకు!—అని సమాధానం చెప్పుకుని. ప్రకాశ్ 24 నంబర్ కోసం ఎదురుచూసి, అందులోనే వెళ్ళాడు.

ఆ తరువాత ఆమెనించి దూరంగా ఉండలేకపోయాడు ప్రకాశ్. ఆమె సౌందర్యం అతన్ని నిజంగానే పిచ్చివాణ్ణి చేసింది.

ఆమెని చూసినప్పుడల్లా రెండు భావాలు అతని మనస్సులో ఒక్కసారి మీదికి లేచేవి— విపరీతమైన కోరికా, దానితోనే భయం. ఆమె కళ్ళు తన కళ్ళతో కలిసినప్పుడల్లా ఏదో సందేశం తన కోసం ఆ కలయికలో ఉందన్నది అతనికి నిశ్చయంగానే తెలిసేది. కాని, ఆ సందేశం ఏమిటి? ఆమె మనస్సులో తన భావాల వంటినే ఉన్నాయనా? లేక, అది హేళనగా "దూరంగా ఉండు" అనా?

ఈ ఆరు నెలల నించీ ప్రకాశ్ ఈ పరిస్థితిలో సతమతం అయిపోయాడు. ఈ వేళ గ్రేస్ కళ్ళలో ఒక కొత్త కాంతి అతనికి కనిపించింది. అందులో అవహేళనకన్న ఆహ్వానమే అతని కెక్కువ కనిపించింది. నిజానికి, ఆ కళ్ళనిండా తన కోసం తియ్యటి. వెచ్చటి పిలుపు తప్ప అతని కేమీ కనిపించలేదు.

కాని, అత నలాగని నమ్మలేక పోయాడు. ఆ సౌందర్యం అంతా తన చేతుల్లో ఉంచుకో గలిగే యోగం ఎంత ఆకర్షణీయంగా కనిపించినా, అతను చూడగలిగింది గులాబులు కాదు—వాటి చుట్టూ ఉండి. తన ఆలోచనల్లో అతిశయోక్తి లాగ పెరిగిన ముళ్ళు మాత్రమే!

గ్రేస్ చిరునవ్వు అలాగే ఉంది.

ఆమె తన వైపు అలాగే చూస్తూంది.

అతనికి చెమట పోసింది. తల వంచుకుని వ్రాస్తూన్న రిపోర్ట్ మీద దృష్టి నిలపడానికి ఎంత ప్రయత్నించినా, అతనికి ఆ కాగితం మీద ఏముందో కనపడలేదు.

ఆమె తనని మనస్పూతో పిలుస్తూంది. ఇది నిశ్చయం అనిపించింది. కాని, ఆమె ముఖంలోకి చూసి చిరునవ్వుతో కళ్లతో పలకరించే ధైర్యం అతనికి లేదు.

క్రింద ఏడు ఇలాగే ఒక అమ్మాయి పరిచయం స్నేహంగా మారాక, ప్రకాశ్ వ్యామోహంలో ఆమెకి తన కోరిక సూచించాడు.

అదంతా అతనికి జ్ఞాపకం వచ్చింది.

ఆ అమ్మాయి ముందర తెల్లబోయింది. నటనలే అనుకున్నాడు. అతని అంచనాలని ధ్రువపరుస్తూ ఆమె రెండు రోజుల తరవాత ఇంటికి రమ్మంది, వాళ్లవాళ్లు ఎక్కడో పెళ్లికి వెడతారు, ఇల్లు ఖాళీగా ఉంటుందని.

ఆ రోజు జరిగినది తలుచుకుని అతని ఒళ్లు జలదరించింది. ఎముకలు విరగలేదు, నయం!

గ్రేస్‌కి దూరంగా ఉండడం మంచిది. ఒక్క అనుభవం చాలు జీవితానికి! అనిపించింది, గట్టిగా.

ఎయిర్ కండిషన్డ్ గది అయినా అతనికి ఉక్క పోస్తూంది. బయటికి వెళ్ళాలి. కాని, గ్రేస్ హేళన తప్పకుండా ఎక్కువౌతుంది, తన పలాయనంతో.

ఎలాగో మరో పది నిమిషాలు గడిచాయి. అతను తల ఎత్తి చూడలేదు కాని, ఆమె చూపులు అతనికి తెలుస్తూనే ఉన్నాయి.

'సార్! డైరెక్టర్ పిలుస్తున్నారు.'

ఒక్కసారి లేచి నిలబడ్డాడు ప్రకాశ్. ఈ గదిలోంచి బయట పడేందుకు వచ్చిన అవకాశం ఇచ్చిన ఆనందంలో అతని కింకే ఆలోచనా రాలేదు. వెడుతూంటే, మళ్లీ గ్రేస్ తన వంక చిరునవ్వుతో చూసింది. అప్రయత్నంగా అతనూ నవ్వాడు. గ్రేస్ తల వంచుకుంది, అదే చిరునవ్వుతో.



కథా నిలయం
45579

అతను ఇంకా త్వరగా డైరెక్టర్ రూమ్‌కి నడిచాడు.

లాంఛనాలు పూర్తి అవగానే, "ప్రకాశ్! బొంబాయినుంచి టెలిఫోన్ వచ్చింది. అక్కడ అసిస్టెంట్ మానేజరు రాజీనామా ఇచ్చాడు" అన్నాడు డైరెక్టర్.

'అయితే!' అన్నట్టు గౌరవంగా చూశాడు ప్రకాశ్.

'మీకు కొంత ఎక్స్‌పీరియన్స్ ఉంది.... వెంటనే—అంటే రెండు మూడు రోజుల్లో వెళ్లి ఛార్జి తీసుకో గలరా?'

అత్యాశ్చర్యంతో చూశాడు ప్రకాశ్.

'అక్కడ ఒక్క రోజు కూడా మన మనిషి లేకుండా పని జరగదు....ఏమంటారు? వెంటనే వెళ్లగలరా? రేపటికి చెప్పండి....'

'థాంక్స్....'

'గుడ్. ఆలోచించండి. ఎల్లుండి సోమవారం ఉదయం ఫ్లయిట్‌లో వెళ్లండి. ఏ మాటా రేపు చెప్పండి.'

నీరసంగా బయటికి వస్తూంటే, "ప్రకాశ్! మీరు వెళ్లి జాయిన్ అయేదాకా ఇది రహస్యంగా ఉంచండి" అని హెచ్చరించాడు డైరెక్టర్.

ప్రకాశ్ వచ్చి టేబిల్ ముందు కూర్చున్నాడు.

అతని ఆలోచనలన్నీ చిందరవందరగా ఉన్నాయి. అందరూ లంచ్‌కి వెళ్లిపోయారు అని అతను గమనించేసరికి అయిదు నిమిషాలు పట్టింది.

ఇన్ని ఆలోచనల మధ్యా అతనికి గ్రేస్ జ్ఞాపకం వచ్చింది. నరనరాల్లో నించి ఆమె కోసం ఆకాంక్ష అతన్ని మళ్లీ లొంగదీసుకుంది.

హఠాత్తుగా అతనికి ఒక ఆలోచన వచ్చింది.

తెల్లకాగితం ఒకటి తీసుకుని దాని మీద టైప్ చేసి ఒక కవరుతో పెట్టి గ్రేస్ డ్రాయర్‌లో పెట్టాడు, ఆమె చిరునామా టైప్ చేసి. "నిన్ను ప్రేమిస్తున్నాను....ఎప్పుడు, ఎక్కడ కలుసుకోవడం?" అని సందేశం.

ఎంత ఆలోచించినా, ఆమె ప్రతి మాటలో, చేతలో హేళన మాత్రం కనిపించసాగింది.

ఇంత హఠాత్తుగా గ్రేస్ ఎందుకు మారింది?

'బుద్ధి చెప్పడానికి' అన్నాడు లోపల ఉన్న బుద్ధిమంతుడు.

ఆరున్నర.

ఆరూ నలభై అయిదు ...

ఆలోచించిన కొద్ది అతనికి ఆనమ్మిక దృఢతరం కాసాగింది. నిజానికి తనలో ప్రత్యేకత ఏమీలేదు....అందమైన అమ్మాయిని చూస్తే ఇలాటి వ్యామోహం తప్ప.

గ్రేస్‌కి చాలా చాలా పెద్ద రకం స్నేహితులు ఉన్నారు. ఆ మాట రెండు మూడు సార్లు విన్నాడు. నిజమే అయి ఉంటుంది. అంత అందం ఉన్నాక, ఆమె తనలాటి వాడికోసం బాధపడి నక్కరలేదు.

ఏడయింది.

ఏడున్నర....

అతను లేచాడు. తెలివితేటలలో గండం—నిశ్చయమైన గండం—తప్పించుకున్న సంతోషంతో అతను లేచాడు. ఎయిర్ లైన్ హౌస్‌కి వెడితే రేపు ఉదయం ఫ్లయిట్‌లో బొంబాయి పోవచ్చును. ఆ మాట డైరెక్టర్‌కి అక్కడినించే చెప్పవచ్చును.

పార్కులోనించి బయటికి వచ్చేసరికి టాక్సీ సిద్ధంగా ఉంది. అది శుభ శకునంలాగ కనిపించింది ప్రకాశ్‌కి. జేబులో డబ్బు పెట్టుకుని రావడం మరొక శకునం!

* * * *

గ్రేస్ మాటిమాటికి కిటికీలో నించి గేటువైపూ, తన గడియారం వైపూ చూడసాగింది. అత నెందుకు ఆలస్యం చేస్తున్నాడు?

ఆక్సిడెంట్ అయిందా?

టాక్సీ దొరకలేదా?

ఏడున్నర....

ఆమె ఆందోళన ఎక్కువైంది.

కనీసం అత నెక్కడ ఉంటూంటాడో తెలిస్తే బాగుండును!

ఏమిటిది!

'స్టుపిడ్' అనుకుంది గ్రేస్.

టేబిల్ మీద ఎంతో అనురాగంతో అమర్చిన పువ్వులు వాడిపోయాయి.

ఎంతో ఆలోచించి సిద్ధంచేసిన రికార్డులు అలాగే పడి ఉన్నాయి.

ఎంతో ఆత్రతతో అతనికోసం ఎదురుచూపిన హృదయం శూన్యం అయి, అతనిమీద ద్వేషంతో నిండిపోయింది.

కన్నీళ్లు ఆపుకోలేక పోయింది గ్రేస్,

"స్టుపిడ్!" అని కన్నీళ్ళ మధ్య మరోసారి అనుకుంది.

—o—